రాజ్‌భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాజ్‌భవన్‌లో ఎట్‌హోం

పాల్గొన్న సీఎం, మంత్రులు

హైదరాబాద్, ఆగస్టు 15(నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరయ్యారు. వారంతా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి అక్కడే తేనీటి విందు స్వీకరించారు.



తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవీప్రసాద్ తదితరులు

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

తెలంగాణ భవన్‌లో జాతీయ జెండా ఎగురవేసిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్యం పొందడమే కాదు.. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఎందరో మహోన్నత వ్యక్తుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం. నాడు వారంతా పోరాడి స్వాతంత్ర్యం తేవడంతోనే నేడు మనమంతా ఆత్మగౌరవంగా జీవిస్తున్నాము. ఈ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉన్నది. ఇదే సమయంలో మహనీయులను నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నది' అని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, దేవీప్రసాద్, ఎం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో జరిగిన జెండావిష్కరణలో పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయండి

- ప్రభుత్వానికి సీజే ప్రతిపాదన
- హైకోర్టులో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- తెలుగులో తీర్పుల వెబ్‌సైట్ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు15 (నమస్తే తెలంగాణ): న్యాయవాదుల రక్షణ కోసం చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సూచించారు. గురువారం హైకోర్టులో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 'న్యాయవాదులపై దాడులు చేయాలనుకునే వాళ్లలో వణుకు పుట్టాలంటే చట్టం ఉండాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి సూచన చేశారు. ఈ సూచనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నది' అని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలోనే చట్టాన్ని తీసుకొస్తుందనే నమ్మకం తనకు ఉన్నదన్నారు. క్రిమినల్ కేసుల్లో కోర్టులు జారీ చేసిన సమన్లను నిందితులకు వెంటనే అందజేసేందుకు వీలుగా త్వరలోనే ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తామని తెలిపారు. ప్రస్తుతం రెండు ధర్మాసనాలు పేపర్లు లేకుండానే కోర్టు విధులను నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులు ఇంగ్లిష్‌తోపాటు తెలుగులో ప్రజలకు అందుబాటులో ఉండే వెబ్‌సైట్‌ను జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. ప్రసంగించిన వారిలో అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఉన్నారు. చదువులో ప్రతిభ చూపిన హైకోర్టు ఉద్యోగుల పిల్లలకు ఈసారీ అవార్డులను అందజేసిన మాజీ ఉద్యోగి విరూపాక్ష రెడ్డిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు.

కాళ్లకు బూట్లతోనే జెండా ఎత్తబోయిన విప్

మహబూబాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ బూట్లు వేసుకుని జాతీయ జెండా ఎత్తబోయారు. కలెక్టర్ అటెండర్ సూచనతో తేరుకొన్న విప్.. షూస్‌విప్పి జెండావిష్కరించారు.

• పట్టణ ప్రథమ మహిళకు అవమానం

జనగామ, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అవమానం జరిగింది. జనగామ జిల్లా కేంద్రంలో వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కలెక్టర్ షేఖ్‌రిజ్వాన్‌బాషా వేదిక ఎక్కుతున్నారు. పట్టణ ప్రథమ మహిళ, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునను 'మీకు ప్రొటోకాల్ లేదు' అని పోలీసులు అడ్డుకోగా, ఎమ్మెల్యే పల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ సూచనతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సైతం వేదిక పక్కకు వెళ్లి కూర్చోవాలంటూ చెప్పారు.

తులం బంగారం ఇంకా దొరకలేదా?

- మహాలక్ష్మికి 2500 ఏమయ్యాయి?
- స్టేషన్ ఘన్‌పూర్‌కు త్వరలో ఉప ఎన్నిక ఖాయం : కేటీఆర్
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నేతల చేరిక

మాజీ జడ్పీటీసీ రవికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో పల్లా, రాజయ్య

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు ఇస్తామన్న తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద ఇస్తామన్న రూ. 2,500 ఏమయ్యాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2.5 లక్షల పెండింగ్లు అయ్యాయని గుర్తుచేశారు. వృద్ధులకు 4 వేలు ఇస్తామని చెప్పి రెండు నెలల పైసలు ఎగ్గొట్టారని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఎటు చూసినా రేవంత్‌రెడ్డి అన్నదమ్ములే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకి అమృత్ పథకం కింద వెయ్యి కోట్ల టెండర్లలో పనులు అప్పజెప్పారని పేర్కొన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు మారపాక రవి, మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్య, ప్రవీణ్, తిరుపతి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మరో 50 ఏండ్లు పటిష్ఠంగా ఉంటుందని తేల్చి చెప్పారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమంటూ తప్పుడు ప్రచారం జరుగుతున్నదని, అదే నిజమైతే తమ ఇంటి అడబిడ్డ 150 రోజులుగా జైలులో ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

భట్టికి నోబెల్ బహుమతి ఇవ్వొచ్చు

రూ.75 కోట్లతో సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేశామని చెప్తున్న భట్టికి నోబెల్ బహుమతి ఇవ్వొచ్చని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ పూర్తిచేసిన పనులను తన క్రెడిట్‌లో వేసుకునేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను కూడా తామే ఇచ్చినట్టు రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జాబ్‌లెస్ క్యాలెండర్ ప్రకటించారని మండిపడ్డారు. వడ్లకు బోనస్‌పైనా రేవంత్ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు

స్టేషన్ ఘన్‌పూర్ సహా మిగిలిన స్థానాల్లోనూ కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని, అప్పుడు ప్రజల ముందుకు కాంగ్రెస్ వైఫల్యాలను తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు జరిగే ఎన్నికల్లో రాజయ్య విజయం పక్కా అని జోస్యం చెప్పారు. కాగ్నిజెంట్ సంస్థ బీఆర్ఎస్ ఉన్నప్పుడే ఒప్పందం కుదుర్చుకున్నదని, దీనినీ రేవంత్ తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో నాయకులు పోయినా కార్యకర్తలకు కొదవలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ దురాగతాలను అడ్డుకోవడానికి తమకు అండగా ఉండాలని కోరారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య మాట్లాడుతూ నమ్మక ద్రోహానికి కడియం శ్రీహరి పరాకాష్ట అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్నో అవకాశాలు ఇచ్చినా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటి చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర నాయకులు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలా?

మోసం చేయడం కాంగ్రెస్ నైజమని కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారని, కానీ దానిని అమలు చేయకుండానే కాంగ్రెస్ స్థానిక ఎన్నికలకు వెళ్తుందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్

తెలంగాణ వ్యతిరేకికి రాజ్యసభ సీటా?

- రాష్ట్ర కాంగ్రెస్‌లో అర్హులే లేరా?
- ఢిల్లీలో మన ఆత్మగౌరవం తాకట్టు
- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యతిరేకి అయిన అభిషేక్ సింఘ్వీకి రాష్ట్రం నుంచి రాజ్యసభ సీటు ఇచ్చారని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని బీసీ, మాదిగ, మైనార్టీల్లో ఎవరికైనా రాజ్యసభ సీటు ఇస్తారని అనుకున్నాం. వీ హనుమంతరావు లాంటి సీనియర్లు కాంగ్రెస్ అధిష్ఠానానికి కనిపించలేదు. సింఘ్వీ ఏ రోజూ తెలంగాణకు అనుకూలంగా మాట్లాడలేదు. గతంలో ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఆయన తెలంగాణ వ్యతిరేకి. ఇక్కడివారికి పరిపాలన చేతకాదు అన్నట్టు మాట్లాడారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల డిమాండ్లు ఉన్నందున రెండో ఎస్సార్సీ వేయాలని అన్నడు. హైదరాబాద్ లేని తెలంగాణ ఇవ్వాలని అన్నడు' అని గుర్తుచేశారు. రాష్ట్రంలో అర్హులే లేరన్నట్టు ఢిల్లీ వారికి రాజ్యసభ సీటు ఇవ్వటం రాష్ట్ర ప్రజలను అవమానించటమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని ధ్వజమెత్తారు. ముస్లిం, ముదిరాజ్, మున్నూరుకాపు, యాదవ కులాలకు మంత్రివర్గంలో అవకాశం దక్కలేదని, కనీసం రాజ్యసభలోనైనా చాన్స్ దక్కుతుందని చూశామని వెల్లడించారు. సామాజికవర్గాల పరంగా కేసీఆర్ సమన్యాయం చేశారని తెలిపారు. డీ శ్రీనివాస్, బండ ప్రకాశ్, లింగయ్యయాదవ్ లాంటి వెనకబడినవర్గాలకు అవకాశం కల్పించారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభం చాలా సంతోషకరమని, కేసీఆర్ అంటేనే నీళ్లు గుర్తుకు వస్తాయని అన్నారు.

కేసీఆర్ ఇతర రాష్ట్రాల వారికి సీటు ఇవ్వలేదు: శ్రీనివాస్ గౌడ్

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పదవులన్నీ తెలంగాణేతరులకే దక్కేవని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్‌లు, సీఎం పదవులు అన్నీ వారికే వచ్చేవని తెలిపారు. తెలంగాణ ఉద్యమం రావడానికి అసమానతలు కూడా కారణమని వెల్లడించారు. కేసీఆర్ తెలంగాణ తెచ్చినందుకే రేవంత్‌రెడ్డి సీఎం, కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారని అన్నారు. కేసీఆర్‌పై పెద్ద స్థాయిలో ఒత్తిళ్లు వచ్చినా ఇతర రాష్ట్రాల వారికి రాజ్యసభ సీటు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యతిరేకులకు ఇక్కడి నుంచి పదవులు ఇవ్వడం బాధ కలిగిస్తున్నదని చెప్పారు. బీసీలకు అవకాశం ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

రాజీవ్ విగ్రహం.. అస్థిత్వంపై దాడే

- తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసే కుట్ర
- సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సోయి లేదు.. వలసవాద పుత్రుడు
- మొండిగా వ్యవహరిస్తే ప్రజల ధర్మాగ్రహానికి గురికాక తప్పదు
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ హెచ్చరిక

మీడియాతో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్. చిత్రంలో దేవీప్రసాద్, పల్లె రవికుమార్‌గౌడ్

> ఇప్పటికైనా రాజీవ్‌గాంధీ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలి. అలా కాదని మొండికేస్తే తెలంగాణలో అలజడి మొదలవుతుంది, ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. మేము ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుంది. తెలంగాణ అస్థిత్వం మీద దాడి చేయడం మానాలి. -దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్న చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ముమ్మాటికీ మన అస్తిత్వంపై దాడేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహం సచివాలయం, అమరజ్యోతి మధ్యలో ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నదని అన్నారు. దేశమంతా ఓ వైపు స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు జరుపుకుంటుంటే ఇక్కడ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ స్వాభిమానం మీద దాడి చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ స్వాభిమానాన్ని దెబ్బతీసేందుకు రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఏనాడు ప్రాంతీయ అకాంక్షలు తెలియవని, ఆ పార్టీ అప్రజాస్వామిక విధానాల కారణంగానే అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సోయి లేదని, ఆయన వలసవాద పుత్రుడని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమం సమయంలో.. ఎవరైనా చంద్రబాబు దగ్గరికి వస్తే ప్రాణాలు తీస్తా అన్నట్టు రేవంత్ రైఫిల్ పట్టుకుని తిరగాడని ఆరోపించారు. రేవంత్ సీఎం అయ్యాక జై తెలంగాణ నినాదం మసకబారిపోయిందని, ఆ స్థానంలో జై సోనియా, జై కాంగ్రెస్ నినాదాలు వచ్చాయని మండిపడ్డారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ అధికార చిహ్నంలోని చార్మినార్, కాకతీయ తోరణాలను రాచరిక చిహ్నాలని అవహేళన చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్‌గాంధీ విగ్రహం కాదని డిమాండ్‌చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ప్రజల ప్రతీక

తెలంగాణ తల్లి తెలంగాణ ప్రజల ప్రతీక అని, వ్యక్తి కాదనే విషయాన్ని గుర్తించాలని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ఒక వ్యక్తి అని గుర్తుచేశారు. రాజకీయ సంకుచిత వైఖరి, మొండివైఖరితో వ్యవహరిస్తే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ తల్లి విగ్రహం కావాలా లేక రాహుల్‌గాంధీ తండ్రి విగ్రహం కావాలా ప్రజలు తేల్చుకోవాలని సూచించారు.

కేసీఆర్ పేరు చెరిపేస్తే చెరిగిపోయేది కాదు

రాజీవ్‌గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణతో సోనియా గాంధీకి సంబంధం ఉందన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టే ముందు తెలంగాణ మేధావులతో ఏమైనా చర్చలు జరిపారా? కనీసం కోదండరాం, హరగోపాల్, అందెశ్రీ అభిప్రాయాలనైనా తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. వారు ముగ్గురైనా రాజీవ్‌గాంధీ విగ్రహం అక్కడ వద్దని రేవంత్‌కు సూచిస్తే మంచిదని అన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి తెలంగాణ సచివాలయానికి ఏం సంబంధం అని బీఆర్ఎస్ నేత జీ దేవీప్రసాద్ ప్రశ్నించారు. సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం తెలంగాణ ప్రజల మనసును గాయపరచడమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ విగ్రహం విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే ప్రజల ధర్మాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

లోకం పోకడ

మనం ఇలాగే ఇంకా కసిగా పనిచేసి ఏలియన్లను పార్టీలోకి చేర్చుకొని గ్రహాలతో పోటీ పడాలి సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	25.5°c
రంగారెడ్డి	37.3°c	22.6°c
మెదక్	36.8°c	23.6°c
నల్లగొండ	34.5°c	24.0°c
ఖమ్మం	34.0°c	25.0°c
హైదరాబాద్	33.8°c	25.8°c
మహబూబ్‌నగర్	33.4°c	24.2°c
కరీంనగర్	33.0°c	27.0°c
నిజామాబాద్	32.2°c	26.4°c
వరంగల్	32.0°c	26.0°c

జెండా స్టిక్కర్‌ను తలకిందులుగా ధరించి జెండావిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 15: పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన షర్ట్‌పై జాతీయజెండా స్టిక్కర్‌ను తలకిందులుగా ధరించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ జెండావిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికే క్రమంలో కళాశాల సిబ్బంది జెండా స్టిక్కర్‌ను ఇలా తలకిందులుగా పెట్టారు. ఆయన దానిని గమనించకుండా జాతీయ జెండాను ఎగురవేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యాయి.

బాన్సువాడ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో బూట్లను తీసి పక్కన పెడుతున్న అటెండర్

ఉన్నతాధికారి బూట్లు పట్టిన అటెండర్

బాన్సువాడ, ఆగస్టు 15: బాన్సువాడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవమానకర ఘటన చోటుచేసుకుంది. జెండావిష్కరణకు వచ్చిన ఆర్డీవో.. జెండా గద్దె సమీపంలో బూట్లు వదిలారు. దీంతో అటెండర్ వచ్చి ఆర్డీవో బూట్లను తీసి పక్కన పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉన్నతాధికారి బూట్లను అటెండర్ మోయడమేంటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఆర్డీవోను వివరణ కోరగా స్పందించలేదు.

ఎమ్మెల్యేల నారాజ్

నిజామాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పంద్రాగస్టు వేడుకల్లో గౌరవ వందన స్వీకారోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పలువురిలో అసంతృప్తిని రగిల్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఒకింత నారాజ్ అయినట్టుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సీనియర్ శాసనసభ్యులను పక్కన పెట్టి కార్పొరేషన్ చైర్మన్లకు జెండా ఎగురవేసే అవకాశం రావడంతో పలువురు నొచ్చుకున్నట్టుగా తెలుస్తున్నది. ఇందులో భాగంగానే జెండా వందనానికే ముఖం చాటేసినట్టుగా అర్థమవుతున్నది. కామారెడ్డిలో వేరే జిల్లాకు చెందిన వ్యక్తి కి అవకాశం ఇచ్చి ఈ ప్రాంతానికి చెందిన షబ్బీర్ అలీని వేరే జిల్లాకు పంపడంపైనా చర్చ నడుస్తున్నది. మంత్రి పదవి రాలేదన్న బాధ వెంటాడుతుండగా.. మరోవైపు పంద్రాగస్టు వేడుకల్లో జెండా ఆవిష్కరణలోనూ చోటు లేకపోవడంతో సుదర్శన్‌రెడ్డి వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఎమ్మెల్యేలూ అసంతృప్తితో ఉన్నారు.

జెండావిష్కరణ ఏర్పాట్లలో ఘర్షణ

వెల్దండలో కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

నర్మెట, ఆగస్టు 15: జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తులతో దాడి వరకు వెళ్లింది. జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండ గ్రామంలో కొందరు యువకులు చందాలు వేసుకొని బుధవారం రాత్రి జాతీయ జెండావిష్కరణ ఏర్పాట్లు చేశారు. ఈ విషయంలో గోల్కొండ శ్రీనివాస్, కంతి స్వామికి బుధవారం రాత్రి గొడవ జరిగింది. గురువారం ఉదయం జాతీయ జెండావిష్కరణ అనంతరం పెద్ద మనుషులు పిలిచి రాత్రి గొడవ ఎందుకు జరిగిందని స్వామిని, శ్రీనివాస్‌ను విచారించారు. శ్రీనివాస్ పెద్ద మనుషులు చెప్పింది వినకుండా తన వద్ద ఉన్న కత్తితో స్వామి, రవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన స్వామిని హైదరాబాద్‌లోని నీలిమా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నగేశ్ తెలిపారు.